క్లుప్తంగా

ఐకేపీ కార్యాలయంలో ఆడిట్



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో సోమవారం ఆడిట్ అధికారులు 2023–24కు సంబంధించిన ఆడిట్ నిర్వహించినట్లు ఏపీఎం జగదీష్ తెలిపారు. మండలంలోని 32 గ్రామ సంఘాలకు సంబంధించిన జమాఖర్చుల వివరాలను ఆడిట్ అధికారులు పరిశీలించినట్లు ఆయన తెలిపారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత తదితరులున్నారు.

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి



ఎల్లారెడ్డి: రైతులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి రాజాగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని వెల్లుట్ల గ్రామంలో రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై అవగాహన కల్పించారు. రైతులు లైసెన్సు ఉన్న దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి దానికి సంబంధించిన రసీదును తీసుకుని భద్రపర్చుకోవాలన్నారు.

29న ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ఈనెల 29న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మానిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీలో మిగిలిన రిజర్వుడు కేటగిరిలో గల సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు ఒరిజినల్ పత్రాలతో ఉదయం 10 గంటలలోగా హాజరు కావాలని ఆమె సూచించారు.

నాగిరెడ్డిపేటలో కంటి శిబిరం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని పీహెచ్‌సీలో సోమవారం ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యులు సృజన్ కుమార్ తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బాన్సువాడ లయన్స్ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో 68 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వీరిలో 8 మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని ఆప్తాల్మిక్ వైద్యులు హరికిషన్ తెలిపారు.

విత్తన దుకాణాల తనిఖీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని చిట్యాల గ్రామంలో విత్తనాల దుకాణాన్ని సోమవారం వ్యవసాయ శాఖ ఏడీఏ రత్న తనిఖీ చేశారు. లూజ్ విత్తనాలు, సర్టిఫైయిడ్‌లేని విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా దుకాణానికి సంబంధించిన రికార్డులు, బిల్లులను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు ఆధికృత డీలర్ల వద్దే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన అనంతరం దుకాణాల నుంచి రశీదులను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఏవో శ్రీకాంత్, ఏఈవో లిఖిత్ రెడ్డి, డీలర్లు, రైతులు తదితరులు ఉన్నారు.

మిర్జాపూర్ సొసైటీ చైర్మన్‌గా రాంబాబు



నస్రుల్లాబాద్(బాన్సువాడ):మండలంలోని మిర్జాపూర్ సొసైటీ చైర్మన్‌గా రాంబాబు ఎన్నికయ్యారు.గతంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మారుతి చైర్మన్‌గా ఉండేవారు. అయితే అవిశ్వాసం పెడతారన్న సంకేతాలతో ఆయన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దీనితో ఇంత కాలం వైస్ చైర్మన్ బాధ్యతలను నిర్వర్తించారు. సోమవారం 12 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా రాంబాబును చైర్మన్‌గా ప్రతిపాదించడంతో మిర్జాపూర్ సొసైటీ కూడా కాంగ్రెస్ హస్తగతమైంది.ఆయనను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందు రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్, అరిగె సాయిలు, ప్రతాప్ సింగ్,దొబ్బల గంగారాం తదితరులు అభినందించారు.

అంగట్లో అంగన్‌వాడీ గుడ్లు

- పౌష్టికాహారానికి దూరమవుతున్న బాలింతలు, చిన్నారులు
- నస్రుల్లాబాద్‌లో దర్జాగా విక్రయిస్తున్న దుకాణదారులు
- లోగో ప్రింట్ చెరిపేసి అమ్ముతున్న వైనం



గుడ్డుపై ఉన్న నీలం రంగు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : బాలింతలకు, గర్భిణులకు, తల్లులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా గుడ్లను సరఫరా చేస్తుంది. కాని వాటిని అంగట్లో విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. దీని ద్వారా బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారానికి దూరం అవుతున్నారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఓ దుకాణంలో ప్రతి గుడ్డుపై నీలి రంగు ముద్ర ఉంటుంది. ప్రభుత్వం అంగన్‌వాడీ సరఫరా చేసిన గుడ్డుపై ఉన్న లోగోను రసాయనాలు, వేడి నీరు ఉపయోగించి చెరిపి బహిరంగంగా దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ఈ తంతు ఒక్క నస్రుల్లాబాద్‌లోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

బహిరంగ మార్కెట్‌లో..

అంగట్లోకి అంగన్‌వాడీ గుడ్డు రావడం వెనుక పలు అనుమానాలు ఉన్నాయి. అయితే గుడ్డును అంగన్‌వాడీ టీచర్లు అమ్ముతున్నారా లేదా లబ్ధిదారులు అమ్ముతున్నారా అన్నది సందేహాత్మక ప్రశ్న. అయితే అంగన్‌వాడీలో ఇచ్చిన గుడ్లను అమ్మినా. కొన్నా..అది చట్ట వ్యతిరేకమే.. బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ప్రతిరోజు తినాల్సిన గుడ్డును ఇలా అంగట్లో కనపడే సరికి ప్రజలు అవాక్కవుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ సెక్టార్లు ఉన్నాయి. ఇందులో 1,193 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో 1,038 మెయిన్, 115 మినీ సెంటర్లు ఉన్నాయి. వీటిల్లో దాదాపు 7,200 మంది గర్భిణులు, 6,900 మంది బాలింతలు ఉండగా 0–6 ఏళ్లమధ్య 56వేల మంది చిన్నారులున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్డు సరఫరా సాఫీగా సాగుతోంది. కాని అధికారులు కేంద్రాల పర్యవేక్షణ సక్రమంగా లేదనే చెప్పుకోవాలి. నామమాత్రపు తనిఖీలు చేయడం వలన గుడ్డు తింటున్నారా, బయటి మార్కెట్‌లో అమ్ముతున్నారా అనేది ఎవరూ గమనించట్లేదు. దీనికి తోడు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారుల విధుల్లో నిర్లక్ష్యం కారణంగా గుడ్డు అమ్ముడుపోతుంది. ఉన్నతాధికారులు స్పందించి గుడ్లు బహిరంగా మార్కెట్‌కు తరలకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

హోరాహోరీగా మల్లయోధుల కుస్తీ



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు



విజేతకు నగదును అందజేస్తున్న నిర్వాహకులు

నిజాంసాగర్(జుక్కల్): ఊర పండుగల ఉత్సవాల్లో భాగంగా సోమవారం మాగిలో మల్లయోధుల కుస్తీ పోటీలు నిర్వహించారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి మల్లయోధులు కుస్తీ పోటీలకు తరలి రావడంతో పోరు రసవత్తరంగా సాగింది. కొబ్బరి కాయ నుంచి ప్రారంభమైన కుస్తీపోటీలు 5 తులాల వెండి కడియం వరకు నిర్వహించారు. ఆఖరి కుస్తీ పోటీ విజేతకు తన తండ్రి చీకోటి రామకిష్టయ్య జ్ఞాపకార్థం కుమారుడు చీకోటి మనోజ్ పటేల్ 5 తులాల వెండి కడియాన్ని బహుమానంగా అందజేశారు. కుస్తీ పోటీల నిర్వాహకులు గుర్రపు శ్రీనివాస్, పెద్దోళ్ల నారాయణ తదితరులున్నారు.

జుక్కల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి



మద్నూర్(జుక్కల్) : జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావుకు మంత్రి పదవి కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ 1957లో జుక్కల్ నియోజకవర్గం సెగ్మెంట్‌గా ఏర్పడిందన్నారు. 1978లో జుక్కల్ ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గంగా మారిందని కాని ఆనాటి నుంచి నేటి వరకు జుక్కల్ నియోజకవర్గానికి మంత్రి పదవి కేటాయించలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్‌పటేల్, గంగాధర్, వట్నాల్ రమేశ్, రాజు ఉన్నారు.

నర్సరీల్లో మొక్కలను కాపాడాలి





పెద్దకొడప్‌గల్ వైకుంఠధామంను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నాగరాజు, నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్):నర్సరీల్లో వంద శాతం మొక్కలు పెరిగేలా చూడాలని డీఎల్‌పీవో నాగరాజు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండలంలో చిన్న తక్కడ్‌ పల్లి, పెద్దకొడప్‌గల్ గ్రామాల్లోని కంపోస్ట్ షెడ్, వైకుంఠధామం, నర్సరీ, పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోవడం, వైకుంఠధామం నిరుపయోగంగా ఉండడంపై జీపీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యకాంత్, పంచాయతీ కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాహం తీరేదెలా..?



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని పోచారం గ్రామంలో అధికంగా పశువుల పెంపకం దారులు ఉంటారు. గ్రామంలోని వ్యవసాయ గిడ్డంగి వద్ద పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టిలో ఎప్పుడు నీళ్లు ఉండట్లేదు. ఇప్పటికైనా స్థానిక జీపీ సిబ్బంది తొట్టిలో నీళ్లు నింపితే మూగజీవాల దాహార్తి తీర్చిన వారవుతారని స్థానికులు కోరుతున్నారు.



ఎండిన మొక్కలు..

మాచారెడ్డి : మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో కొత్తగా నిర్మించిన రోడ్డు డివైడర్‌పై నాటిన మొక్కలు నీళ్లు పోయకపోవడంతో మొత్తం ఎండిపోయాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు నుంచి ఘన్‌పూర్ స్టేజీ వరకు రూ. 1.26 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మించారు. కొద్ది రోజులుగా నీళ్లు పోయడం మానుకోవడంతో మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. అధికారులు స్పందించి మళ్లీ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్ : ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతిలో 9 జీపీఏ, ఇంటర్‌లో 900లకు పైగా మార్కులు సాధించిన ఆర్య వైశ్య విద్యార్థులను ప్రశంసాపత్రం, జ్ఞాపిక, శాలువతో అభినందించడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు అవోపా ప్రతినిధులు సంతోష్‌కుమార్ గుప్తా, టి శ్రీనివాస్‌గుప్తా, గంగప్రసాద్‌గుప్తా కోరారు. జిల్లాలోని అర్హులైన ఆర్యవైశ్య విద్యార్థులు జూన్8వ తేదీలోగా వాట్సప్ ద్వారా 94405 97851, 98491 27237, 92999 96088కు పంపాలని అవోపా ప్రతినిధులు సూచించారు.

వైకుంఠధామాల్లో లేచిపోయిన షెడ్లు



బాన్సువాడ రూరల్ : మండలంలోని కొయ్యగుట్ట గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన వైకుంఠ ధామం షెడ్ రేకులు గాలిదుమారానికి దూరంలో ఎగిరి పడ్డాయి. సింటెక్స్ వాటర్ ట్యాంకులు ధ్వంసమైనట్లు పంచాయతీ కార్యదర్శి రాహేలాబేగం తెలిపారు. తాడ్కోల్ గామానికి చెందిన గంట గంగాధర్, పుట్టి అంజవ్వకు చెందిన ఇంటిషెడ్లు కూలిపోయినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి తెలిపారు. అలాగే గ్రామ శివారులోని వైకుంఠధామంలోనూ ట్యాంకు పగిలిపోయింది. డోర్లు ఊడిపోయాయి. గతంలో కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేపట్టడం వల్ల ఇలా తొలకరి వర్షాలకే నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు వాపోతున్నారు.

29న కోఆప్షన్ మెంబర్ ఎన్నిక



తాడ్వాయి : మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 29వ తేదీన జరుగు కోఆప్షన్ మెంబర్ ఎన్నిక జరుగనుంది. గతంలో కోఆప్షన్ మెంబర్‌గా పనిచేసిన ఎర్రాపహాడ్‌కు చెందిన ఇంతియాజ్ అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. తాడ్వాయి మండలంలో 9మంది ఎంపీటీసీలకుగాను అందులో ఐదుగురు కాంగ్రెస్‌పార్టీలకు చెందిన వారు, ముగ్గురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు, ఒకరు బీజేపీకి చెందిన వారు ఉన్నారు.

శరవేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామంలో ఆదివారం గాలివాన బీభత్సంతో సుమారు 15 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో బాన్సువాడ రూరల్ విద్యుత్ శాఖ ఏఈ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో రాత్రి నుంచే పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. కూలిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని బిగించి 24 గంటల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఎల్ఐసీ ఏజెంట్ రక్తదానం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ గడ్డం రఘువీర్‌రెడ్డి సోమవారం రక్త హీనతతో ఉన్న ఓ మహిళ రోగికి రక్తదానం చేసినట్టు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయ కర్త బాలు తెలిపారు.

యోగాతో బహుళ ప్రయోజనాలు



యోగా శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అంబీర్ మనోహర్ రావు

కామారెడ్డి అర్బన్ : విద్యార్థులు యోగా చేయడం ద్వారా బహుళ ప్రయోజనాలుంటాయని పీఆర్‌టీయూ(టీజీ) జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్ రావు అన్నారు. కామారెడ్డి లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో ఆదియోగి పరమేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి యోగా శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యోగాచార్యులు సిద్ధిరాములు, ఆదియోగి పరమేశ్వర్ ఫౌండేషన్ ప్రతినిధి నివాస్‌పటేల్, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సంబురాలు



దోమకొండ : బీడీ కార్మికులకు ప్యాకర్లకు, బట్టి, చటన్ తదితర కార్మికులకు వేతనాలు పెరిగినందున తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో కార్మికులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధ రాములు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, కార్మికులు, కుమ్మరి, రవి, శంకు, ఎల్లయ్య, దుర్గయ్య, భాస్కర్, నర్సింలు, పరిధి పేట దేశాయి సెంటర్‌లో నందు, వెంకటి, కృష్ణ తదితరులు సంబురాల్లో పాల్గొన్నారు. తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తదితరులున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించవద్దు



మాచారెడ్డిలో మాట్లాడుతున్న ఏవో రమ్యశ్రీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏవో సుప్రజ్యోతి

మాచారెడ్డి : నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయించవద్దని మండల వ్యవసాయాధికారిణి రమ్యశ్రీ అన్నారు. ఈ మేరకు సోమవారం గజ్యా నాయక్ తండా చౌరస్తాలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని విత్తనాలు, ఎరువుల దుకాణ డీలర్లను హెచ్చరించారు.

రాజంపేటలో..

రాజంపేట : ఫర్టిలైజర్ డీలర్లు రైతులుకు నాణ్యమైన విత్తనాలను అమ్మాలని మండల వ్యవసాయాధికారిణి సుప్రజ్యోతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండల ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీలర్లు నాణ్యమైన విత్తనాలకు రైతులకు విక్రయించాలని అదే విధంగా రైతులకు బిల్లు అందించాలని తెలిపారు. బిల్‌బుక్స్, స్టాక్‌బోర్డు, విత్తనాల స్టాక్‌ను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు మన్యూష, మౌనిక, శిల్ప, శ్రీకాంత్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టె విత్తనాల విక్రయం

భిక్కనూరు : మండల కేంద్రంలోని సింగిల్‌విండోలో ఈనెల 28వ తేదీ మంగళవారం నుంచి పచ్చిరొట్టె విత్తనాల విక్రయాలను ప్రారంభిస్తున్నట్లు విండో చైర్మన్ గంగ్గల భూమయ్య తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పెద్ద జనుము 40 కిలోల బస్తాను రూ. 1,448లకు జీలుగా 30 కిలోల బస్తాను రూ. 1,116కు విక్రయిస్తున్నామన్నారు.

సొసైటీల ద్వారా విత్తనాల విక్రయం

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కేంద్రం ద్వారా రైతులకు 833 బస్తాల జీలుగు, 282 బస్తాల జనుము విత్తనాలను విక్రయించామని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఏసీఎస్ కేంద్రానికి వచ్చిన జీలుగు, జనుము విత్తనాలను సోమవారం నుండి ఆన్‌లైన్‌లో అమ్మకం మొదలుపెడతామన్న సమాచారాన్ని వ్యవసాయ విస్తరణాధికారుల ద్వారా కామారెడ్డి మండలంలోని గ్రామా రైతులకు ముందుగా సమాచారమందించామన్నారు. ఈ సమాచారం మేరకు రైతులందరూ ఉదయమే పంపిణీ కేంద్రానికి చేరుకొని విత్తనాల కోసం వరుసలో నిలబడ్డారన్నారు. ఆన్‌లైన్‌లో పర్మిట్, బిల్లు జనరేట్ చేయడానికి కొంత సమయం పట్టినందున రైతులు క్యూ పెరిగిందన్నారు. కాగా అదనంగా జీలుగు, జనుము విత్తనాలు కావాలని ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టామని, రాగానే తెలియపరుస్తామని, రైతులు సంయమనం పాటించాలని భాగ్యలక్ష్మి కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి

నిజాంసాగర్(జుక్కల్) : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తమ వంతు కృషి చేయాలని మండల పరిషత్ అధ్యక్షురాలు పట్లోళ్ల జ్యోతి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తాగునీటి సరఫరాతో పాటు సంపూర్ణ పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేయాలన్నారు. వర్షాకాలం ఆరంభం నాటికి రక్షిత నీటి ట్యాంకులను శుద్ధి చేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తూ గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడేలా చూడాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మనోహర్, అచ్చంపేట సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీడీవో గంగాధర్, తహసీల్దార్ భిక్షపతి, వ్యవసాయశాఖ అధికారి అమర్ ప్రసాద్ ఏఈలు స్వర్ణలత, సురేశ్, శివప్రసాద్, లక్ష్మణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

అటవీ భూమి పరిశీలన

గాంధారి(ఎల్లారెడ్డి) : అటవీ భూమి కోసం రెండు తండాల రైతులు ఘర్షణ పడి కొత్తాబాది తండా, సోమారం తండాల గ్రామస్తులు పరస్పర ఫిర్యాదులు చేసుకున్న విషయం విదితమే. సదరు అటవీ శాఖ భూమిని సోమవారం ఎఫ్ఆర్వో హేమ చందన తన సిబ్బందితో వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. ఇరు తండాల రైతులు సదరు భూమి తమదంటే తమదని ఘర్షణ పడ్డారన్నారు. అయితే సోమారం తండాకు చెందిన మహిళా రైతుకు మూడెకరాల పోడు భూమి పట్టా ఉందన్నారు. కొత్తాబాది తండా రైతులు ఎలాంటి ఆధారాలు చూయించలేదన్నారు. పోడు పట్టా ఇచ్చిన భూమినే సాగు చేస్తున్నారని, కొత్తగా అటవీ భూమిని దున్నలేదని ఎఫ్ఆర్వో అన్నారు.

కొనసాగుతున్న 'అమ్మ ఆదర్శ' పనులు



రాజంపేట : రాజంపేట మండలం కొండాపూర్ క్లస్టర్ శేర్‌శంకర్ తండాలోని ప్రాథమిక అమ్మ ఆదర్శ పనుల్లో భాగంగా పాఠశాల్లో విద్యుత్ పనులు పూర్తయినట్లు అదే విధంగా ప్లంబర్ పనులు కొనసాగుతున్నట్లు ఐకేపీ సీసీ భాగయ్య తెలిపారు.

ఆధ్యాత్మికం

నేడు ఎల్లమ్మ బోనాల జాతర



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు రెండు రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారికి గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాల జాతర ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు రాజేశ్వర్‌గౌడ్, పెద్ద సాయాగౌడ్ తెలిపారు. ఇంటింటికో బోనం, కలషాలు, శివసత్తుల పూనకాలు, పోతరాజు విన్యాసాల మధ్య బోనాలను ఊరేగించారు.

ఘనంగా విష్ణుసహస్రనామ పారాయణం



భిక్కనూరు : మండలంలోని సిద్ధరామేశ్వరాలయంలో ఉడిపి వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాస్తు హోమపూజలు ఏడవ రోజు ఘనంగా జరిగాయి. సోమవారం తిలహోమం, విష్ణుసహస్ర పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేసిన ప్రత్యేక ముగ్గులో పూజలు చేశారు. తదుపరి సామూహికంగా విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ లింబాద్రి, మాజీ సర్పంచ్‌లు తున్కి వేణు, నర్సింహారెడ్డి తదితరులున్నారు.